క్లుప్తంగా

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ

గుడిపాల: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయశాఖాధికారి తులసి, ఆత్మ బీటీఎం దేవేంద్ర అన్నారు. మంగళవారం నంగమంగళం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిసాగులో సమగ్ర పంటల యాజమాన్యం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం, రైతును స్వయం నిర్ణయాధికారిగా తయారు చేయడం వంటి విషయాలపై రైతులకు వివరించారు. సమగ్ర సస్యరక్షణ విధానాలను పాటించడం వల్ల రసాయన పురుగు మందులు వాడకం తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షిస్తూ సుస్థిర దిగుబడులు సాధించడానికి ఆస్కారం ఉంటుందన్నారు.

ప్రతి ఇంటి ముంగిటకే వైద్యసేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలు అందజేస్తున్నట్లు వైద్యాధికారి రష్మిత అన్నారు. మంగళవారం కుప్పిగానిపల్లె గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికీ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలను అందజేశారు. అనంతరం ఇంటి వద్ద మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వేలాంగణిలో ప్రార్థనలు



వేలాంగణిలో వైఎస్సార్‌సీపీ యువనాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ నుంచి బయటకు రావాలని చిత్తూరు మండల వైఎస్సార్‌సీపీ యువ నాయకులు తమిళనాడులోని వేలాంగణి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్రమ అరెస్ట్ నుంచి విడిపించాలని, ప్రతిపక్షానికి మంచి బుద్ధి ప్రసాదించాలని అక్కడున్న మేరిమాత మందిరానికి మోకాళ్లతో నడిచివెళ్లారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు స్టాండ్లీ, పాండియన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



స్తంభాన్ని ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం సబ్‌స్టేషన్ సమీపంలో బంగారుపాళెం–అరగొండ రహదారిపై మంగళవారం కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. స్థానికుల కథనం మేరకు.. బంగారుపాళెం నుంచి కాణిపాకానికి వెళ్తుండగా ఎదురుగా ద్విచక్రవాహనం అడ్డు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి రహదారి పక్కన గల విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ సంఘటనతో పెద్దప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిర్లక్ష్యం వీడి.. లక్ష్యం చేరి..



పాడైన ట్రాన్స్‌ఫార్మర్లు



2 వేల లీటర్ల నూతన ఓలిఎం



శుద్ధి చేసిన ఆయిల్‌ను డ్రమ్ములో పడుతున్న టెక్నీషియన్

- గత ప్రభుత్వంలో మంజూరైన ఎస్పీఎం
- రూ.50 లక్షలతో ఏర్పాటు
- సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేసి రైతులకు అందిస్తున్న వైనం
- నెరవేరుతున్న గత ప్రభుత్వ లక్ష్యం

చిత్తూరు కార్పొరేషన్: అన్నదాతల శ్రేయస్సు కోసం గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు కృషి చేసింది. గతంలో పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రోజుల తరబడి ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం చుట్టూ తిరిగేవారు. అయితే అన్నదాతల కష్టాలకు చెక్ పెట్టేందుకు జిల్లా కేంద్రంలోని ఎస్పీఎం (ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం)ను రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసింది. అయితే ప్రభుత్వం మారిన తర్వాత దాని పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. వేసవి కాలంలో కేంద్రం ఉపయోగాలు, ఆవశ్యకతపై సాక్షిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. వాటిపై స్పందించిన అధికారులు మిషన్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. అలాగే టెక్నికల్ సహాయకుడిని నియమించారు. దీంతో రైతులకు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేసి పంపుతున్నామని అధికారులు చెబుతున్నారు. గతంలో 200 లీటర్ల ఆయిల్‌ను 40 పాయింట్లు బీడీవీ (బ్రేక్ డౌన్ వోల్టేజీ)తో శుద్ధి చేస్తుండగా నూతన మిషన్ 70 పాయింట్లతో చేస్తోంది. గతంలో రోజూ 200–400 లీటర్ల ఆయిల్‌ను మాత్రమే శుద్ధి చేసేవారు. దాంతో 4 ట్రాన్స్‌ఫార్మర్ల మాత్రమే వాటిని వాటిని వాడేవారు. ప్రస్తుతం 1000 లీటర్లను శుద్ధి చేస్తుండడంతో 6 ట్రాన్స్‌ఫార్మర్లకు వాటిని వాడుతున్నామని ఏఈ మోహన్‌శెట్టి తెలిపారు. రాష్ట్రంలో మోడల్‌గా ఎస్పీఎంగా చిత్తూరును దిద్దుతామని.. ఈ విధానాన్ని ప్రతి జిల్లాలో అమలు చేస్తామని ఇటీవల సీఎండీ సంతోష్‌రావు ప్రకటించిన విషయం తెలిసిందే.



చిత్తూరులో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం



శుద్ధి చేసిన తర్వాత ఆయిల్

ఫ్యాక్టరీల బెదిరింపులు ఇక సాగవు



మాట్లాడుతున్న రైతు నాయకులు

- ఫ్యాక్టరీల నుంచి తోతాపురి కేజీ రూ.8 ఇప్పిస్తాం
- ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఇన్నాళ్లు ఫ్యాక్టరీ వాళ్లు ఏం చెప్పినా విన్నాం..ఇకపై వారి బెదిరింపులు సాగవని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. చిత్తూరు నగరం జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ మామిడి దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం తోతాపురి కేజీకి రూ.12గా మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఇన్నాళ్లు ఈ ఫ్యాక్టరీలు, ర్యాంపులు రూ.2.50, రూ.4, రూ.5, రూ.6 చొప్పున ఇస్తాయన్నారు. ఏదైతే రాష్ట్రప్రభుత్వం ఫ్యాక్టరీలు రూ.8 ఇవ్వాలని ప్రకటించిందో.. ఆ ధర ప్రకారమే ఫ్యాక్టరీలు చెల్లించేలా చూస్తామన్నారు. ఇన్నాళ్లు వారు ఏం చెప్పినా నోరు మెదపకుండా ఉన్నామన్నారు. ఫ్యాక్టరీలు కాయలు కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఇన్నాళ్లు ఓపికగా ఉన్నామన్నారు. ఇక కాయల కొనుగోలు ముగిసిందని, గుజ్జు తయారీ పూర్తయిందన్నారు. ఇప్పుడు వాళ్ల గుజ్జు తమ అడ్డాలో ఉందని, ఇక వారి బెదిరింపులు సాగవన్నారు. కచ్చితంగా ఫ్యాక్టరీల నుంచి తోతాపురి కేజీకి రూ.8 చొప్పున వసూళ్లు చేయిస్తామన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మామిడికి ప్రోత్సాహం అందిస్తున్నాయని తెలిపారు. రైతు సంఘం నాయకులు జనార్దన్, ఆనందనాయుడు, మునీశ్వర్‌రెడ్డి, హరిబాబు చౌదరి, మునీశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉమాపతినాయుడు, జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దూర విద్యావిధానం సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంఈఓ రుషేంద్రబాబు

ఐరాల: ఏపీ విద్యాశాఖ, సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానం(ఓపెన్ స్కూల్) నిర్వహిస్తున్నామని, వాటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రుషేంద్రబాబు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు ఆధ్వర్యంలో మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంతో పదో తరగతి, ఇంటర్ విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పదో తరగతి ఫెయిల్ అయిన వారికి, బడి మధ్యలో ఆపేసిన 14 సంవత్సరాలు నిండిన వారికి పదో తరగతి చదువుకునే సువర్ణ అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే ఇంటర్ ఆపేసిన వారికి, ఫెయిల్ అయిన వారికి ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం ఉందన్నారు. 15 ఏళ్లు నిండి పదో తరగతి పూర్తయిన వారంతా ఇంటర్ కోర్సు చదువుకునే వీలుంటుందని తెలియజేశారు. ఓపెన్ స్కూల్ సెలవు రోజుల్లో మాత్రమే నిర్వహించనున్నట్లు చెప్పారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి మంచి అవకాశమని తెలిపారు. ప్రవేశాల కోసం గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పంటకు బీమాపై అవగాహన



రైతులకు సలహాలు ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పూతలపట్టు(యాదమరి): వరి పంటను సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా బీమా చేసుకోవాలని ఏఓ మధురవాణి అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌సీ ఏడీఏ నాగపద్మిని, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సంధ్యారాణి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో వరి పంటపై పెనుప్రభావం చూపే ప్రమాదం ఉందని చెప్పారు. ఈదురు గాలులకు, భారీ వర్షాలకు పంట దెబ్బతినే అవకాశం ఉందని చెప్పారు. అందుచేత ప్రతి రైతు వరి పంటపై బీమా చేసుకుంటే వరి సాగు చేస్తున్న రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సెరికల్చర్ శాఖాధికారి ఆర్ముగం మాట్లాడుతూ ఆ సాగులో ఉన్న ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వివరాలను రైతులకు వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సంధ్యారాణి మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని అధిక దిగుబడిని సాధించవచ్చని చెప్పారు. నాగపద్మిని మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని కోరారు. రైతులకు పంటలపై తగు సూచనలు, సలహాలు అందజేశారు. అన్నదాత సుఖీభవ జాబితాలో తమ వివరాలను చూసుకోవాలన్నారు. లేనివారు ఈరోజు లోపల రైతు సేవాకేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని ఏఓ మధురవాణి రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు వేరుశనగ విత్తుకోవచ్చు



సరకల్లులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి జి.ప్రవీణ్

తవణంపల్లె: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనాలను ఈ నెలాఖరులోగా విత్తుకోవచ్చని వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని సరకల్లులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు విత్తేముందు విత్తనశుద్ధి చేయించాలన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ, జీవన ఎరువులు వాడాలన్నారు. వేరుశనగలో అంతరపంటగా కందిని సాగు చేసుకోవచ్చని వివరించారు. చీడపీడలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. రసం పీల్చే పురుగులు నివారణకు వేరుశనగ పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న సాగు చేసుకోవచ్చన్నారు. అంతర పంటగా ఆముదపు మొక్కలను అక్కడ వేసుకోవడం మంచిదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రాగి, వరి, కంది పంటకు ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే పంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడిని నిర్ణయించి నష్టపోయిన రైతులకు మండలం యూనిట్‌గా ఇన్సూరెన్స్ చేసుకున్న రైతులకు మాత్రమే నష్టపరిహారం అందుతుందని వెల్లడించారు. అనంతరం క్షేత్రస్థాయిలో వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ కుసుమ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అవగాహన

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్ ఆదేశించారు. మంగళవారం జెడ్పీలోని పీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా పారిశుద్ధ్య లోపం ఉంటే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

చీకట్లో చిట్టి చదువులు

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం చిన్నపిల్లల చదువును పునాదుల్లోనే చిదిమేస్తోంది. మారుమూల ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలపై చిన్నచూపు చూస్తుండటంతో అడుగడుగునా నిర్లక్ష్యానికి గురవుతున్నారు. యాదమరి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీకేంద్రాలు కనీస వసతులకు నోచుకోకపోవడంతో చిన్నారుల ఆటపాటల చదువు సందిగ్ధంలో పడుతోంది. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా ఇవ్వనంత దౌర్భాగ్య స్థితిని కల్పించిన పాలకుల నిర్లక్ష్యంపై చిన్నారుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చీకటిలో ఆటవస్తువులతో ఆడుకుంటున్న చిన్నారులు

- అంధకారంలో ఓటేరుపల్లి అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ
- చిన్నారుల భవిష్యత్‌కు బంగారు బాట కాదు.. విద్యుత్ బల్బ్ వేస్తే చాలు
- కనీస వసతులు కల్పించని ఐసీడీఎస్ అధికారులు
- అసంపూర్తిగా పక్కా భవనం

యాదమరి: మండల పరిధి ఓటేరుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం చీకట్లో మగ్గుతోంది. నెలల తరబడి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్త చీకట్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తోంది. అభం శుభం తెలియని చిన్నారులు ఆటలాడుతూ కింద పడి గాయాలపాలవుతున్నారు. ఈ విషయంపై పిల్లల తల్లిదండ్రులు పిల్లలను సంరక్షించడం ఇదేనా అని అంగన్‌వాడీ కార్యకర్తలను నిలదీస్తున్నారు. అయితే విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఐసీడీఎస్ ఉన్నతాధికారుల నుంచి నిర్లక్ష్యమే ఎదురవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. చీకటిలో పసిపిల్లలు చదువుకోవడం.. ఆడుకోవడం ఎలా అని ప్రశ్నిస్తున్నారు. చిన్నారుల కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు కల్పించడంలోనూ కూటమి ప్రభుత్వం విఫలమవుతుండడంపై తల్లిదండ్రులు తమ చిన్నబిడ్డలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించడం మానేశారు. గ్రామంలో చాలామంది ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు నివాసం ఉంటున్నారు. ఇంటి పట్టునే పిల్లలు ఉంటే వారి భవిష్యత్ అంధకారం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆర్థిక స్తోమత ఉన్న కొంతమంది తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్పించారు. గత విద్యాసంవత్సరం వరకు ఇక్కడ దాదాపు పదిమంది వరకు పిల్లలు వచ్చేవారు. కానీ ఈ విద్యాసంవత్సరంలో ఐదుగురు తగ్గడం వెనుక అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

పక్కా భవనం కలేనా ?

ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నా ఓటేరుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం పక్కా భవనం కలగానే మిగులుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. గత 20 ఏళ్లుగా పంచాయతీ భవనంలో.. లేదంటే ఆరుబయట సెంటర్ నిర్వహిస్తూ వస్తున్నారని అంటున్నారు. గతంలో శాశ్వత భవనం కోసం నిర్మాణాలు చేపట్టినా బిల్లులు మంజూరు కాకపోవడంతో సదరు గుత్తేదారు పనులను ఆపేశారు. దీంతో ప్రాథమిక పాఠశాల కోసం నిర్మించిన ఓ భవనంలోనే అంగన్‌వాడీకేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్నారు. అయితే ఆ భవనానికి విద్యుత్ పనులు పూర్తి కాకపోవడంతో చీకట్లోనే పసిపిల్లలు తమ బాల్య చదువును, ఆటలను కొనసాగిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పించి చిన్నారుల భవిష్యత్‌కు బాటలు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అక్రమ అరెస్టులతో నిర్బంధించలేరు



ధనుంజయరెడ్డి జెడ్పీ వైస్‌చైర్మన్



సురేష్‌బాబు ఎంపీపీ

యాదమరి: అక్రమ కేసులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నిర్బంధించలేరని జెడ్పీ వైస్‌చైర్మన్ ధనుంజయరెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు స్పష్టం చేశారు. మంగళవారం వారు మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నుదన్నుగా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసు బనాయించి అరెస్టు చేసిందని ఆరోపించారు. జిల్లాలో తన ఉనికి కోసమే చంద్రబాబు ప్రజాదరణ కలిగిన పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఆపలేదని.. తాము అహర్నిశలు పార్టీ కోసం కష్టపడతామని స్పష్టం చేశారు.

రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు



వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి

బంగారుపాళెం: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందని వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై లేని లిక్కర్ కేసును బనాయించి అరెస్టు చేయడం దారుణమన్నారు. ఇలాంటి కుట్రపూరిత కేసులు నిలబడవన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని విమర్శించారు.

ఎంపీ అరెస్టు.. కూటమి కుట్రే..



సమావేశంలో మాట్లాడుతున్న యతీష్

పూతలపట్టు(యాదమరి): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు కూటమి ప్రభుత్వం కుట్రలో భాగంగానే జరిగిందని వైఎస్సార్‌సీపీ బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి టీ.ఎస్.యతీష్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు కూటమి ప్రభుత్వానికి తాత్కాలిక సంతోషాన్ని ఇస్తుందే తప్ప ఎటువంటి ఉపయోగం అయితే ఉండదని స్పష్టం చేశారు. అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుల స్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. కూటమి ప్రభుత్వం తమ వైఫల్యాలను ప్రజల నుంచి దృష్టి మరల్చేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమిని గద్దె దింపే వరకు ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ సర్పంచ్ రాజేంద్ర, నాయకులు బాలాజి, విజయ్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేసి నివేదికలు ఇవ్వండి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని పెద్దపంజాణి ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న సురేంద్రరెడ్డిపై నమోదైన ఆరోపణలను విచారించి నివేదికలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు సురేంద్రరెడ్డి అధికార దుర్వినియోగం, ప్రభుత్వ డేటాను అనధికారికంగా యాక్సెస్ చేశారని, ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని అమరావతిలోని పీజీఆర్ఎస్ పోర్టల్‌లో చిత్తూరు నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కనకరాజులు నాయుడు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుకు స్పందించిన పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ నాగార్జున సాగర్ నమోదైన ఫిర్యాదును విచారించి 15 రోజుల్లో లిఖిత పూర్వకంగా నివేదికలు పంపాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. ఈ విచారణకు జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణను విచారణ అధికారిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.